క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వేమూరు: మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో శివన్నారాయణ తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ యల్లమాటి మోహనరావు అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావలెనని ఆయన తెలిపారు.

ఉర్లమ్మకు విశేష పూజలు



పెదగొల్లపాలెం(కర్లపాలెం): గ్రామ దేవత ఉర్లమ్మ అమ్మవారికి ఆదివారం రైతులు, భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం పంటలు దివ్యంగా పండి అధిక దిగుబడులు వచ్చినందున గ్రామంలోని రైతులు, భక్తులు తమ ఇళ్ల వద్ద పొంగళ్లు చేసి పసుపు కుంకుమలతో అలంకరించి పొంగళ్లను తలపై ఉంచుకుని ప్రదర్శనగా అమ్మవారి శిల వద్దకు వచ్చి ప్రదక్షిణలు చేశారు. అనంతరం తాము పండించిన పంటలు అమ్మవారి శిల వద్ద ఉంచి, నైవేద్యాలు సమర్పించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



రేపల్లె రూరల్: రాబోవు పబ్లిక్ పరీక్షల్లో 10వ తరగతి విద్యార్థులు సత్ఫలితాలను సాధించాలని పట్టణ ఎస్ఐ రాజశేఖర్ చెప్పారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పుట్టగుంట ఆదినారాయణ కుటుంబ సభ్యుల సహకారంతో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం ఆయన స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలే కాకుండా వారి అభ్యున్నతికి సైతం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్‌లు సహకరించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని నూరు శాతం ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.సాయి ప్రసాద్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవీబీ సుబ్రమణ్యం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గిరికుమారి, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు ఏం.సూర్యప్రకాష్, వై.నవీన్, హేమ నాగశ్రీ, అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



కొల్లూరు : గంధ మహోత్సవం కొల్లూరులో ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి గంధ మహోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన జెండాను గ్రామంలో ఊరేగింపు చేపట్టి తిరిగి జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ముస్లింలతోపాటు హిందువులు సైతం పాల్గొని మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

అగ్రహారంలో మార్మోగిన శివనామస్మరణ



కర్లపాలెం: కర్లపాలెం అగ్రహారం శివనామస్మరణతో మార్మోగింది. కర్లపాలెం పంచాయతీ అగ్రహారంలోని గంగా, గౌరీ సమేత బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీభార్గవి హైస్కూల్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ యాజలి గ్రామ కమిటీ అధ్యక్షుడు పేరాల వెంకట సురేష్ దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి చిత్ర పటాలకు, విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధిలో శివ మాల ధరించిన భక్తులందరూ అగ్రహారంలోని బదరీ కేదారేశ్వర ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉన్న స్వామివారి చిత్ర పటాలకు పూజలు చేసి భజనలు నిర్వహించారు. అనంతరం సురేష్ దంపతుల సహకారంతో స్వాములకు తీర్థప్రసాదాలు, సద్ది పంపిణీ జరిగింది.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

తెనాలిఅర్బన్: రాష్ట్ర నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం మంగళవారం ఉదయం 11 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ డైరెక్టర్ ఎంపికైన తెనాలివాసి కురగంటి రఘురామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ రుద్రకోటి సదాశివం అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, కొల్లు రవీంద్ర, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని చెప్పారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

వాడవాడలా రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

రేపల్లె రూరల్: నియోజకవర్గంలోని మండలాల్లో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను గుర్తు చేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

- స్థానిక కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరణ చేశారు. గణతంత్ర దినోత్సవ ఉపన్యాసాన్నిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన వెంకట గోపాలరావు, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఆర్డీవో నేలపు రామలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ సందేశాన్నిచ్చారు. డివిజన్ పరిధిలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన పలువురికి ప్రశంసాపత్రాలు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కాకర్ల సాంబశివరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, పోలీసు సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ సురేశ్‌బాబు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.శోభారాణిలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్ర కుమార్, ఆర్‌సీ డిగ్రీ కళాశాలలో ఐఆర్‌ఈఎఫ్ విద్యా సంస్థల అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలురెబ్బా, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని అరవపల్లి, పేటేరు, ఓల్డ్‌టౌన్‌లో గ్రామ సభ్యులతో కలిసి విశ్వహిందూ పరిషత్ నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలల్లోనూ గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: భారత రాజ్యాంగం ఎంతో మహోన్నతమైనదని తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండలంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీనివాసరావు, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ సుందరమ్మ మహాత్మా గాంధీ, భారతరత్న అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జాతీయ పతాకం ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ గీతాలు ఆలపించారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, డీటీ శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవీంద్ర, మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వరికూటి అశోక్‌బాబు

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): మండలంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మెహర్‌కుమార్ సిబ్బందితో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో సత్యానారాయణ జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు (కొల్లూరు): గణతంత్ర వేడుకలు భట్టిప్రోలు మండలంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని మండలాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డీవీ లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, ఈఓపీఆర్‌డీ టి.ఉషారాణి పాల్గొన్నారు. మండలంలోని జిలుగువారిపాలెం పాఠశాలలోని గణతంత్ర వేడుకల్లో ఎంపీపీ లలితకుమారి పాల్గొన్నారు.



రేపల్లె సబ్ కోర్టు ఆవరణలో త్రివర్ణ పతాకానికి అభివాదం చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

అమర్తలూరులో గణతంత్ర వేడుకలు

అమర్తలూరు(వేమూరు): దేశానికి పూర్తి స్వాతంత్ర్యం పొందిన రోజని వైఎస్సార్‌సీపీ పార్టీ అధికారి ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామంలో గణతంత్ర దినోత్సవం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం జరుపుకోవడం చాల ఆనందంగా ఉందన్నారు. ప్రజల మంచి చెడుల గురించి అలోచన చేయాలని సూచించారు.

నగరంలో...

నగరం: గణతంత్ర వేడుకలను ఆదివారం మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీరామ్‌ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవవందనం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోనికి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎస్వీఆర్ఎం కళాశాలలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రత్నకుమారి జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ విశిష్టతను తెలియజేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల్లో ప్రధానోధ్యాయులు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు.

నిజాంపట్నంలో...

నిజాంపట్నం: దేశం కోసం, దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పని చేయాలని ఎస్ఐ కందుల తిరుపతిరావు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ శాఖల అధికారులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

పిరాట్లంకలో గణతంత్ర దినోత్సవం

రేపల్లె రూరల్: మండలంలోని పిరాట్లంక గ్రామం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని సర్పంచ్ కమతం రమాదేవి ఆవిష్కరించారు. కమతం ఫౌండేషన్ అధినేత కమతం సాంబశివరావు, కమతం విజయకుమారిలు గణతంత్ర దినోత్సవ సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో పిరాట్లంక జెడ్పీ హైస్కూలు హెచ్ఎం ప్రభాకరరావు, పీఈటీ సుబ్బారావు, మాజీ సర్పంచ్ మండలం రామ్మోహన్‌రావు, తోట శ్రీమన్నారాయణ, బర్మా చినవెంకటేశ్వర్లు, కమతం చినపోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: గణతంత్ర వేడుకలు జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దారు సుశీల అన్నారు. తహసీల్దారు కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకులు ఆదివారం నిర్వహించారు. జాతీయ జెండా ఎగుర వేశారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చుందూరులో...

చుందూరు(వేమూరు): మండలంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నాగరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దేశానికి పూర్తి స్వాతంత్ర్యం సాధించి 76 సంవత్సరాలు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె ఆర్డీవో కార్యాలయ ఆవరణలో...



రేపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయంలో...



రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో...



కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద...



నిజాంపట్నం పోలీసు స్టేషన్‌లో...



వేమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద



కర్లపాలెంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సుందరమ్మ



జాతీయ జండా ఆవిష్కరించిన తహసీల్దార్ మెహర్‌కుమార్



భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో...



నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో...



జాతీయ పతాకానికి అభివందనం చేస్తున్న కమతం ఫౌండేషన్ ట్రస్టీలు

బస్టాండ్‌ను ప్రజలు వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

కర్లపాలెం: దాతల సహకారంతో విశాలంగా నిర్మించిన బస్టాండ్‌ను మండల ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. కర్లపాలెంలో గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ఆదివారం ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు పునః ప్రారంభించారు. బస్టాండ్ నిర్మాణానికి సహకరించిన దాత మంతెన నాగరాజు విగ్రహాన్ని ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్గీయ మంతెన నాగరాజు బాపట్ల సమీపంలోని నాగరాజు కాలువ, బుద్దాం సమీపంలోని తుంగభద్ర డ్రెయిన్ నిర్మాణానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. కర్లపాలెం, యాజలి, ఖాజీపాలెం సెంటర్‌లలో బస్టాండ్‌ల నిర్మాణానికి నాగరాజు సహాయ సహకారాలు అందజేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మంతెన నాగరాజు(చినబాబు) తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

ప్రధానోపాధ్యాయురాలి ఉద్యోగ విరమణ

నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నం పెద్దరూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తూ ఈ నెల 31వ తేదీన పదవీ విరమణ చేయనున్న లక్ష్మీపార్వతి ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఏపీటీఎఫ్ నిజాంపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక పాఠశాలలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆమె సేవలను కొనియాడారు. మునిరేడు, శ్రీనగర్, గణపవరం, రాజులపాలెం, పల్లపట్ల తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయిని, ప్రధానోపాధ్యాయరాలిగా ఎందరో ఉపాధ్యాయులను తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపార్వతీ, ఉమామహేశ్వరరావు దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కుర్రా కిరణ్, ప్రధాన కార్యదర్శి ఆలపాటి శ్రావణ్‌కుమార్, సభ్యులు పులి శ్రీనివాసరావు, మౌలాలి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ పార్వతీ దంపతులను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ సంఘ ఉపాధ్యాయులు

వరిగడ్డి దగ్ధం

తెనాలిరూరల్: ట్రాక్టర్ ట్రెయిలర్‌పై ఉన్న వరిగడ్డి దగ్ధమైన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. స్థానిక చినరావూరులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం గడ్డి ట్రాక్టర్ పై ఉన్న వరిగడ్డి దగ్ధమైంది. రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రెయిలర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ట్రాక్టర్‌లోని ఎండు వరిగడ్డి తగలబడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపకాధికారి కోటిరెడ్డి, సిబ్బంది కలిసి మంటలను అదుపు చేశారు. ట్రాక్టర్‌లో మంటలు అంటుకుని తగలబడిపోతున్న గడ్డిని అగ్నిమాపక సిబ్బంది అతికష్టం మీద అదుపు చేశారు.

దీంతో గడ్డి దగ్ధం కాగా ట్రాక్టర్‌ను మాత్రం అగ్నికి ఆహుతికాకుండా కాపడగలిగారు. అవనిగడ్డ నుంచి గడ్డి లోడుతో ట్రాక్టర్ తీసుకువచ్చి అన్‌లోడ్ చేసేందుకు రోడ్డు పక్కన నిలిపి ఉంచామని డ్రైవర్ చెప్పారు. ట్రాక్టర్ రన్నింగ్‌లో ఉండగా ఎక్కడో విద్యుత్ వైర్లు తగిలి నిప్పురాజుకుని ఇక్కడకు వచ్చాక తగలబడి ఉంటుందని ఫైర్ అధికారి కోటిరెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అగ్నిమాపక అధికారులు, సిబ్బందిని స్థానికులు అభినందించారు.

నేడు వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ కమిటీ ఎంపిక

వేమూరు: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ కమిటీ ఎంపిక నిర్వహించడం జరుగుతుందని పార్టీ అధికార ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో సాయంత్రం 4 గంటలకు కమిటీ ఎంపిక నిర్వహించడం జరుగుతుందన్నారు. వేమూరు మండలంలోని పెరవలి గ్రామంలో సాయంత్రం 6.30 గంటలకు, కాకర్లమూడి గ్రామంలో 7.30కు, కుచ్చెళ్లపాడు గ్రామంలో 8.30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాల్గొంటారన్నారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం వేర్వేరుగా విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ వివరాల మేరకు మండలంలోని మైనేనివారిపాలెం గ్రామానికి చెందిన చిరకాల ఆంజనేయులు మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. మైనేనివారిపాలెం బస్టాండ్ వద్ద కేసన శివ మద్యం విక్రయిస్తూ పట్టుబడిందన్నారు. ఆమె వద్ద నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు.

'మానవత' సాయం అభినందనీయం

టీబీ, హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ

తెనాలి: చైతన్యవంతమైన తెనాలిలోనూ మనుషుల్లో మానవత్వం లోపించటం బాధాకరమని, అలాంటి రోజుల్లో మానవత సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు, సహాయం చేసేందుకు సభ్యులు పోటీపడుతుండటం సంతోషం కలిగిస్తోందని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటైన సభకు అధ్యక్షుడు డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. 'ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్' పిలుపునకు తమ వంతుగా సంస్థ ఆధ్వర్యంలో తెనాలి, పరిసరాల్లోని 50 మంది టీబీ, హెచ్ఐవీ రోగులకు నెలకు సరిపడా రూ.25 వేల విలువైన పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. సభలో ముఖ్యఅతిథి కేవీ గోపాలకృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఎక్కడ అవసరం ఉంటే అక్కడ మానవత సభ్యులు సైనికుల్లా తోడ్పడాలని సూచించారు. తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. మానవత రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మానవత సభ్యుల టీమ్ వర్క్‌ను ఆయన అభినందించారు. గుంటూరు అడిషనల్ డీఎంహెచ్‌ఓ, డీఎల్ఏటీతో డాక్టర్ డి.శ్రీనివాసులు మాట్లాడుతూ, టీబీ రోగులు, టీబీతోపాటు హెచ్ఐవీ బాధితులకు మానవతా దృక్పథంతో సాయపడుతున్న సంస్థకు ధన్యవాదాలు తెలియజేశారు. గుంటూరు పీపీఎం వి.రాజశేఖర్, తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ టీబీ, హెచ్ఐవీ రోగులకు సాయపడుతున్న సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. మానవత ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్య శాస్త్రి, కూరపాటి కళ్యాణి, డాక్టర్ శ్యాంసన్, శర్మ, ఈఎల్‌వీ అప్పారావు మాట్లాడారు. సభకు ముందుగా రిపబ్లిక్ డే రోజున ఉత్తమ తహసీల్దార్‌గా జిల్లా కలెక్టరుగా ప్రశంసాపత్రం అందుకున్న మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను సత్కరించారు.



బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ

విద్యార్థులకు వితరణ

తెనాలి: పట్టణానికి చెందిన సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని స్థానిక చినరావూరులోని వాసిరెడ్డి లక్ష్మీపతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి రమేష్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థులకు స్టీల్ టిఫిన్ బాక్సులు, స్వీట్లను పంపిణీ చేశారు. 15 వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, సొసైటీ సభ్యులు బి.సుధాకర్, ప్రశాంత్ కుమార్, కాకుమాను ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాయకులకు బహుమతుల ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో తిరుమలలో అన్నమయ్య సంకీర్తన గానం చేసిన 50 మంది సభ్యులకు ప్రోత్సాహం నిమిత్తం నగదు బహుమతి, జ్ఞాపికలను ఆదివారం పంపిణీ చేశారు. సంకీర్తన బృందం, దాతల సహకారంతో సాయంత్రం ఇక్కడి గీతామందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సంగీత గురువు కత్తివెంటి కమల చేతులమీదుగా పంపిణీ చేశారు. గత నెల 27వ తేదీన తిరుమల ఆస్థానమండపంలో ఉదయం 10 గంటల్నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సంకీర్తన గానం చేసిన సభ్యులను ప్రోత్సహించటం మంచిదన్నారు. పిల్లలు, పెద్దల్లో భక్తిభావం పెరగటానికి, అన్నమయ్య సంకీర్తనల ప్రచారం నిమిత్తం ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని నిర్వాహకుడు కొండపి శ్రీనివాసరావు చెప్పారు. గుంటూరు చెందిన సంకీర్తన గురువు తురగా కళ్యాణి, సుధామాధవి, తెనాలికి చెందిన నందిరాజు ప్రసూనను సంస్థ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. గీతా మందిరం కార్యదర్శి రమేష్, ఈవీఎల్ అప్పారావు, గోవు నరేంద్ర, మాదల సత్యకుమారి, కటకం అన్నపూర్ణ, నంబూరి వినతి, వీరంశెట్టి రజిని, లక్కరాజు కనకదుర్గ పాల్గొన్నారు. సంకీర్తన గురువు కొండపి వసుంధర పర్యవేక్షించారు.